క్లుప్తంగా

ద్వారకాతిరుమలలో భారీ అన్నసమారాధన



ఆళ్వార్ సదనంలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దేవస్థానం ఈఓ త్రినాధరావు

ద్వారకాతిరుమల: గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జన వేడుకలు, భారీ అన్నసమారాధన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా ద్వారకాతిరుమల అర్చిగేటు సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణనాధునికి ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులు విశేష పూజలు చేసి, నివేదన సమర్పించారు. అనంతరం ఆళ్వార్ సదనంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను శ్రీవారి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు ప్రారంభించారు. వేలాది మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సీసీ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభం

చింతలపూడి: మండలంలోని రేచర్ల పంచాయతీలో సీసీ రహదారుల నిర్మాణానికి మండల పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బి.రాంబాబు నాయక్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎస్సీ, బీసీ ఏరియాల్లో సుమారు రూ.20 లక్షల జీజీ ఎంపీ నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో గ్రామీణ రహదారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టి పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సుబ్బారావు, సచివాలయ కన్వీనర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న సర్పంచ్ శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తిరుమలాపురం సర్పంచ్ కనుపర్తి శ్రీనివాస్ అన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలంటే మొక్కలు నాటడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మానవత సంస్థ కోశాధికారి ఇమ్మంది మాధరావు, రీజినల్ చైర్మన్ దల్లి రామాంజనేయరెడ్డి, జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, సొసైటీ అధ్యక్షుడు ఆర్.అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి



తాడిచర్లలో సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీటీసీ

కామవరపుకోట: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మండలంలోని తాడిచర్ల గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, మూమెంట్, స్పందన రిజిస్టర్‌లను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా సచివాలయ సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీటీసీ పోలిమెట్ల ప్రశాంత్, సచివాలయ సెక్రటరీ శాంతారావు, మంగరాజు, మోహన్ ఉన్నారు.

కొయ్యలగూడెం వాసికి పీహెచ్‌డీ పట్టా



బుజ్జిబాబుకి పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: నాగార్జున యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందినట్లు వైజాగ్‌లో నివసిస్తున్న కొయ్యలగూడేనికి చెందిన మిరియాల బుచ్చిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలో పర్యావరణ విభాగం కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ విశాఖ జిల్లా పరవాడ మండలం పరిసర గ్రామాల భూగర్భ జలాల నాణ్యత అనే అంశంపై చేసిన పరిశోధనకు గానూ ఈ పట్టాను అందించినట్టు వివరించారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే తలారి

నియోజకవర్గంలో గృహ నిర్మాణాలకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని వినతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: నియోజకవర్గంలో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం కోరారు. అసెంబ్లీ సమావేశం అనంతరం ఎమ్మెల్యే తలారి సీఎంను కలసి, గృహ నిర్మాణ సమస్యలను వివరించారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ, అలాగే ప్రస్తుతం సొంత స్థలాల్లో శ్లాబ్‌లు వేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలని కోరారు. గోపాలపురం నియోజకవర్గంలో ఫస్ట్ ఫేజ్‌లో నామమాత్రంగా గృహాలు మంజూరయ్యాయని, ప్రస్తుతం జరుగుతున్న సెకండ్ ఫేజ్‌లో ఎక్కువ గృహాలను ప్రత్యేకంగా మంజూరు చేయాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన లబ్ధిదారులందరికీ గృహ రుణాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

స్నేహితులకు ఆర్థికసాయం



నాగమల్లేశ్వరరావుకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కామవరపుకోట: కామవరపుకోట జెడ్పీ హైస్కూల్ నందు 1988–90లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆపదలో ఉన్న తమ స్నేహితులకు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లకు గాయాలై తాడేపల్లిగూడెంలో చికిత్స పొందుతున్న మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గంగాధరరావుకు రూ.20 వేలు, క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కొండగూడెం, నాయకులు పేటకు చెందిన నల్లమోతుల నాగమల్లేశ్వరరావుకు రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బొల్లు వెంకట సత్యనారాయణ, గుడిమెట్ల సత్యనారాయణ, కొప్పిశెట్టి వెంకటరావు, సతీష్, బ్రహ్మయ్య, కనకరాజు, శేషుబాబు, కుమార్, శ్రీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ విజయకృష్ణ

కామవరపుకోట: మండలంలో జీలకర్రగూడెం గ్రామ పరిధిలోని కోదండ రామనగర్, కంఠమనేనివారి గూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ డాక్టర్ వంటిపల్లి విజయకృష్ణ పరిశీలించారు. అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరఫున వారికి అందాల్సిన పోషకాహారం సరఫరా, స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. పిల్లలకు అందించే ఆహారాన్ని, ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని సిబ్బందికి సూచించారు. కోదండరాం నగర్ కేంద్రంలో సిబ్బంది యూనిఫారంలో లేకపోవడం, విద్యార్థులు భోజన సమయానికి కేంద్రానికి చేరుకోవడం, అప్పటి వరకు విద్యార్థులకు హాజరు వేయకపోవడంపై అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని కొవ్వూరు రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. బస్టాండ్ నుండి దళితవాడ మీదుగా జయప్రద హాస్పిటల్ రోడ్డు ఎదుటి వరకు ఈ డ్రెయినేజీని నిర్మిస్తున్నట్లు ఎంపీటీసీ గంటా శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు డ్రెయినేజీ సమస్యను ఎమ్మెల్యే బాలరాజుకు వివరించడంతో ఆయన ఆదేశాల మేరకు డ్రెయినేజీ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో దీనిని నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, సొసైటీ అధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువుల తరలింపు



వ్యాన్‌లో పశువులను తరలిస్తున్న దృశ్యం

టి నరసాపురం: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను కబేళాకు తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై సురేంద్రకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మక్కినవారిగూడెంలో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో అనకాపల్లి జిల్లా మర్రిచర్ల గ్రామానికి చెందిన డి.కనకనరసింహ, చింతలూరు గ్రామానికి చెందిన జి.వంశీకృష్ణలు విజయనగరం జిల్లా ఆలమండ సంతలో 23 పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్ కబేళాకు తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. స్థానిక వీఆర్‌వో బోసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పశువులను హనుమాన్ జంక్షన్ గోశాలకు తరలించినట్లు ఎస్సై చెప్పారు.

మేకపోతు దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు



గాయపడిన గంగమ్మ

ద్వారకాతిరుమల: రహదారిపై నడిచి వెళుతున్న వృద్ధురాలిపై ఒక మేకపోతు దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. ఈ ఘటన ద్వారకాతిరుమల గుడిసెంటర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని కోడిగూడేనికి చెందిన కండెల్లి గంగమ్మ స్థానిక గుడి సెంటర్‌లో నిమ్మకాయలు అమ్ముకుంటూ జీవనాన్ని సాగిస్తోంది. వ్యాపారాన్ని ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డుపై నడిచి వెళుతున్న ఆమెను ఒక మేకపోతు వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. దాంతో ఆమె రోడ్డుపై పడిపోవడంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెకు సపర్యలు చేసి, ఆమె భర్తకిచ్చి ఇంటికి పంపించారు.

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా న్యాయవాదులు చిన్నం సుదీర్, మాండ్రు రాజేంద్ర హాజరయ్యారు. అధ్యక్షుడిగా పయనం రత్నరాజు, గౌరవ అధ్యక్షుడిగా చెల్లెం రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మద్దాల వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా గోధుమ తిరుపతి స్వామి, జాయింట్ సెక్రెటరీగా కాళంగి మనోహర్, కోశాధికారిగా అంబటి మణికుమార్, మహిళా ప్రతినిధిగా ఓగిరాల సుజాతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షుడు కలిసిపూడి రాజబాబు, మాజీ గౌరవ అధ్యక్షుడు కారంపూడి జనార్దనరావు, నోముల రాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు విష్ణు పర్యటన

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు శనివారం ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసే కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లాలో నవరత్నాలు అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రెస్‌మీట్‌లో మాట్లాడతారు. అనంతరం విజయవాడ బయలుదేరి వెళతారు.

ప్రగడవరంలో ఫ్రైడే డ్రైడే

చింతలపూడి: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో శుక్రవారం డ్రైడ్ ఎ ఫ్రైడే అమలు కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. దోమల నిర్మూలన కోసం పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.భరత్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పోలవరం రూరల్: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో జి.శ్రీను సూచించారు. పోలవరం పంచాయతీ పరిధిలోని ఎస్‌డబ్ల్యూఎం షెడ్ వద్ద సర్పంచ్ పాడుం పుష్పతో కలిసి పారిశుధ్యంపై కార్మికులతో చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 18 మంది క్లాప్ మిత్రలతో గ్రామంలో పారిశుధ్యంపై చర్చించారు.

పేదల కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష



బుట్టాయగూడెం మండలం ఎస్‌ఆర్ పాలెంలో సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న పీఓ

బుట్టాయగూడెం: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ఈనెల 30వ తేదీ నుంచి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. మండలంలోని నూతిరామన్నపాలెంలో శుక్రవారం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు నేపథ్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ఇంటింటికీ సర్వే కార్యక్రమాన్ని వైద్య సిబ్బందితో చేపట్టినట్లు చెప్పారు. 9 అంశాలకు సంబంధించి వైద్య పరీక్షలు, వ్యాధుల గురించిన వివరాలను ప్రజల ద్వారా తెలుసుకుని ఆ వివరాలను జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌లో పొందపర్చడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేకు సహకరించాలన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారు వ్యాధుల వివరాలను సిబ్బందికి తెలియజేసి తద్వారా వారు ఆరోగ్యవంతులుగా ఉండేలా వైద్యసేవలు పొందాలన్నారు. కార్యక్రమంలో కేఆర్ పురం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మేరీ కేథరిన్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యోగా పోటీలకు రావికంపాడు విద్యార్థులు



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామవరపుకోట: జిల్లా స్థాయి యోగా పోటీలకు మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు తెలిపారు. శుక్రవారం లింగపాలెం మండలం కె.గోకవరంలో జరిగిన అండర్–17 విభాగంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన యోగా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఉమ్మడి ఈశ్వర్, చాపతుల చరణ్, సాత్విక, లావణ్య, రిప్సిక, విశేష ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన యోగా మాస్టారు నరదల రాధాకృష్ణ, బాలాజీని, ప్రధానోపాధ్యాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

హోరాహోరీగా ఆటల పోటీలు

బుట్టాయగూడెం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోలవరం నియోజకవర్గ స్థాయి బాలికల ఆటల పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలను కొయ్యలగూడెం డీవైఈఓ ఎం.రామన్న దొర, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇరపా గంగాదేవి ప్రారంభించారు. నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 350 మంది పైగా బాలికలు పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో, అండర్–14, 17 త్రోబాల్ తదితర పోటీల్లో 158 మంది బాలికలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు డీవైఈఓ తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



టెన్నికాయిట్ పోటీలకు అండర్ 17 విభాగంలో ఎంపికైన బాలికలు

లింగపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన చింతలపూడి నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. శుక్రవారం లింగపాలెం మండలం కె.గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఎంపిక పోటీల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని సుమారు 20 పాఠశాలల నుంచి 220 మంది క్రీడాకారులు పాల్గొనగా, అండర్–14, అండర్ 17 విభాగాల్లో బాలురు, బాలికలకు ఖోఖో, టెన్నికాయిట్, యోగా పోటీలు నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం టి.నర్సింహరావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. అండర్ 17 ఖోఖో విభాగంలో బాలురు 12 మంది, బాలికలు 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్ 14 ఖోఖో విభాగంలో బాలురు 12 మంది, బాలికలు 12 మందిని ఎంపిక చేశారు. అండర్ 14 టెన్నికాయిట్ విభాగంలో బాలికలు 5, బాలురు 5గురిని ఎంపిక చేసినట్లు నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల సమన్వయకర్త పి.వేణు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో ఏలూరులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ పోటీలను పీఈటీ సీహెచ్‌వీ ప్రకాశ్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేశ్వరరావు, మున్సిపల్ కార్మిక నేతలు రేలంగి నాగరాజు, వీరప్రసాద్, కొత్తూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంలో కాఫీ విత్ మిత్ర



కాఫీ తాగుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మండలంలోని లక్కవరంలో కాఫీ విత్ మిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ గెల్లా వెంకటరమణ, ఎంపీపీ కొడమ జ్యోతి, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్, ఈవోపీఆర్డీ, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ నిమ్మ గురునాధరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు పాల్గొని స్థానికులతో కలిసి కాఫీ సేవించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు. దీనిలో భాగంగా పారిశుధ్య పనులు, దోమల నిర్మూలనకు చర్యలు చేపడ్తామన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం దర్భగూడెం శివారున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.46,890 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని మార్కండేయపురం శివారున పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ దాడిలో రూ.40 నగదు, 4 మోటార్ సైకిళ్లు, 9 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు సంక్షేమమే సొసైటీల ధ్యేయం



మాట్లాడుతున్న పిన్నమనేని చక్రవర్తి

టి నరసాపురం: రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని మక్కినవారిగూడెం సహకార సంఘం చైర్మన్ పిన్నమనేని చక్రవర్తి అన్నారు. సహకార సంఘం ఆవరణలో శుక్రవారం జరిగిన మహా జనసభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ఈ వ్యవస్థ ద్వారా రైతులకు అన్నికాల సేవలను అందించేందుకు కృషిచేస్తున్నారన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర వ్యాపారాలను సైతం సంఘాల ద్వారా చేయిస్తూ సంఘాలను అభివృద్ధి బాటలో పయనించేలా ప్రోత్సహిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో దాసరి రాంబాబు, మందలపు మూర్తి, సర్పంచ్ మెతుకుమిల్లి గోపాలరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షకురాలికి సన్మానం



గౌసియా బేగంను సన్మానం చేస్తున్న మహిళలు

కొయ్యలగూడెం: కుట్టు శిక్షణ ఇచ్చిన శిక్షకురాలిని శిక్షణ తీసుకున్న మహిళలు బయన్నగూడెంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు ట్రైనర్ ఎస్‌కే గౌసియా బేగం సుమారు 70 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజవరం గ్రామంలో కూడా ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించామని ఆ ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫౌండేషన్ ఆర్గనైజర్ ఆరేటి ఏసుబాబు, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గణపతికి 32 కేజీల లడ్డూ బహూకరణ



లడ్డూను బహుకరిస్తున్న శాస్త్రి

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. మెయిన్ సెంటర్లోని గణపతి ఆలయంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాలలో భాగంగా ఉమా స్టూడియో యజమాని 32 కేజీల భారీ లడ్డును స్వామివారికి బహుకరించారు. 25వ తేదీ అన్న సమారాధన, 26వ తేదీ ఊరేగింపు నిర్వహించనున్నారు. రేపల్లెవాడ రామాలయం వద్ద గణనాథుని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. థియేటర్ గణపతి మందిరం వద్ద శనివారం అన్నసమారాధన అనంతరం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేడు ఏలూరులో చినవెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల: ఏలూరు జూట్‌మిల్ సమీపంలోని ధర్మభేరి ప్రాంగణంలో శనివారం చినవెంకన్న కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు చెప్పారు. వేడుకలో భాగంగా స్వామివారి ధర్మ ప్రచార రథం ఉదయం ఆలయం నుంచి బయల్దేరి ధర్మభేరి ప్రాంగణానికి చేరుకుంటుందన్నారు. ఉత్సవం పూర్తయిన తర్వాత తిరిగి ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు. భక్తులు ఈ వేడుకలో పాల్గొనాలని ఆయన కోరారు.